క్లుప్తంగా

చీరలు పంపిణీ



మహిళకు చీర అందజేస్తున్న నాయకులు

నందికొట్కూరు: స్థానిక మారుతీ నగర్‌లో ముస్లిం మహిళలకు వైఎస్సార్‌సీపీ యూత్ నాయకులు చరణ్ సోమవారం చీరలు పంపిణీ చేశారు. రంజాన్ పర్వదినం సందర్భంగా 50 మంది ముస్లిం మహిళలకు చీరలు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మధుసూదన్‌రెడ్డి, మహబూబ్‌బాషా, బాబు, ప్రకాశం, రెహమాన్, శశాంక్, అరుణ్, రియాజ్, లాజర్, మహిళలు పాల్గొన్నారు.

కనుల పండువగా అమ్మవారి ఉత్సవం



అమ్మవారి ఊరేగింపులో భక్తులు

పగిద్యాల: ఉగాది సంబరాల్లో భాగంగా స్థానిక సుంకులాపరమేశ్వరి ఆలయం వద్ద రెండో రోజు సోమవారం అమ్మవారి ఉత్సవాలు కనుల పండువగా సాగాయి. కోలాటం, భజన, డీజే వాయిద్యాలతో సంబరాలు చేశారు. అమ్మవారి వెండి విగ్రహాన్ని పల్లకీలో కొలువుంచి ఊరేగింపు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

పారిశుద్ధ్య పనులు



క్షేత్ర ప్రధాన రహదారులను శుభ్రం చేస్తున్న దేవస్థాన సిబ్బంది

శ్రీశైలంటెంపుల్: ఉగాది మహోత్సవాలను పురస్కరించుకుని వారం రోజులుగా శ్రీశైల క్షేత్ర పురవీధులన్నీ అపరిశుభ్రం అవడంతో దేవస్థాన అధికారులు శుభ్రం చేశారు. సోమవారం స్థానిక ఫైర్‌ఇంజిన్, దేవస్థాన వాటర్ ట్యాంకర్ సాయంతో పారిశుద్ధ్య సిబ్బంది రహదారులను శుభ్రం చేశారు.

అన్నప్రసాద వితరణకు విరాళాలు



దాతను సత్కరిస్తున్న ఏఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణకు సోమవారం నంద్యాలకు చెందిన బి.రంగారెడ్డి రూ.1,50,000 విరాళాన్ని ఏఈఓ జి.స్వాములుకు అందించారు. అలాగే కర్నూలుకు చెందిన కె.ఆర్.వరప్రసాద్‌రెడ్డి రూ.లక్ష విరాళాన్ని సీనియర్ అసిస్టెంట్ చంద్రశేఖరరెడ్డికి అందజేశారు. దాతలకు దేవస్థానం తరపున స్వామివారి శేషవస్త్రం, లడ్డూప్రసాదం అందించి సత్కరించారు.

అలరించిన భక్తిరంజని



భక్తి గీతాలను ఆలపిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై తెనాలికి చెందిన నేరెళ్ల వరలక్ష్మి కల్యాణి, బృందం వారి భక్తి రంజని కార్యక్రమాన్ని నిర్వహించారు.

2న కలెక్టరేట్ ఎదుట నిరసన

నంద్యాల(న్యూటౌన్): విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్ 2న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టనున్నట్లు ఫ్యాప్టో చైర్మన్ కేవీ శివయ్య, జనరల్ సెక్రటరీ అబ్దుల్‌కలాం తెలిపారు. సోమవారం ఫ్యాప్టో కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. సీపీఎస్, జీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, మూడు డీఏలను మంజూరు చేయాలని, 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. 2004లో కంటే ఉపాధ్యాయ వృత్తిలో చేరిన 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు కేంద్రం అమలు పరిచిన జీవో నం. 57ను అమలు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఇంగ్లీష్ మాధ్యమంతో పాటు తెలుగు, ఉర్దూ మాధ్యమాల్లో కొనసాగించాలన్నారు. 11వ పీఆర్సీ బకాయిలను తక్షణమే చెల్లించాలని, ఉమ్మడి సర్వీసు రూల్స్‌కు సంబంధించిన 72, 73, 74 జీవోలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ ఎదుట చేపట్టనున్న నిరసన కార్యక్రమానికి ఉపాధ్యాయులు తరలిరావాలని వారు కోరారు. సమావేశంలో ఫ్యాప్టో నాయకులు గోపాలకృష్ణ, నగిరి శ్రీనివాసులు, అరవిందకుమార్, లక్ష్మణ్‌నాయక్, రామచంద్రారెడ్డి, జాకీర్‌హుసేన్, పుల్లయ్య, సాంబశివుడు, వెంకటేశ్వర్లు, భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

అశ్వవాహనంపై ఆదిదంపతులు

ఆది దంపతులు శ్రీశైలం మల్లికార్జున స్వామి, భ్రమరాంబికా దేవి అమ్మవారు అశ్వవాహనంపై విహరించారు. ఇల కైలాసం శ్రీగిరి క్షేత్రంలో ఐదు రోజులుగా ఉగాది మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. చివరిరోజు సోమవారం మహోత్సవాలకు పూర్ణాహుతి నిర్వహించారు. మల్లికాగుండం వద్ద అవభృదం, త్రిశూలస్నానం నిర్వహించారు. భ్రమరాంబాదేవి నిజాలంకరణలో దర్శనమివ్వగా, అశ్వవాహనంపై విహరించిన స్వామిఅమ్మవార్లను పలువురు కన్నడ భక్తులు దర్శించుకుని తరించారు.



అశ్వవాహనాధీశులై ఊరేగుతున్న స్వామిఅమ్మవార్లు

- మల్లికాగుండం వద్ద అవభృదం, త్రిశూలస్నానం
- నిజాలంకరణలో భ్రమరాంబాదేవి దర్శనం
- శ్రీశైలంలో ముగిసిన ఉగాది మహోత్సవాలు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో జరుగుతున్న ఉగాది మహోత్సవాల్లో చివరి రోజు భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. యాగశాలలో చండీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లోకకల్యాణం కోసం జపాలు, నిత్యహోమ బలిహరణలు చేసి రుద్ర హోమం, జయాదిహోమం జరిపించారు. అమ్మవారి యాగశాలలో చండీహోమం జరిపించారు. అనంతరం యాగపూర్ణాహుతి, వసంతోత్సవం, అవభృదం కార్యక్రమాలు నిర్వహించారు. పూర్ణాహుతి కార్యక్రమంలో శాస్త్రోక్తంగా నారికేళాలు, పలు సుగంధద్రవ్యాలు, ముత్యం, పగడం, నూతన వస్త్రాలు మొదలైన ద్రవ్యాలను హోమగుండంలోకి ఆహుతిగా సమర్పించి యాగకార్యక్రమాన్ని పూర్తి చేశారు. పూర్ణాహుతి అనంతరం వసంతోత్సవం జరిపించారు. కార్యక్రమంలో స్థానాచార్యులు వసంతాన్ని పసుపు, సున్నం, సుగంధ ద్రవ్యాలు కలిపిన మంత్రపూరిత జలాన్ని సమంత్రకంగా భక్తులపై ప్రోక్షించారు.

మల్లికాగుండం వద్ద అవభృదం

చండీశ్వరస్వామికి మల్లికాగుండం వద్ద అవభృదం, త్రిశూల కార్యక్రమాలు జరిపించారు. చండీశ్వరస్వామిని ఆలయ మాడవీధుల గుండా మల్లికాగుండం వద్దకు పల్లకీలో తోడ్కొని వచ్చారు. ఈ సందర్భంగా వేద పారాయణలతో, భాజాభజంత్రీలతో మాడవీధుల్లో స్వామివారికి ఊరేగింపు నిర్వహించారు. పుష్కరిణి వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదిక వద్ద చండీశ్వరస్వామికి అవభృదం జరిపించారు. అవభృదంలో రుద్రధ్యాయ మంత్రాలతో చండీశ్వరస్వామికి శుద్ధజలం, పంచామృతాలు, భస్మోధకం, కుంకుమోదకం, హరిద్రోదకం, సుగంధోదకం, బిల్వోదకం, పుష్పోదకం, నారికేళం మొదలైన వాటితో స్నపన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామివారికి శుద్ధజలంతో వెండి పళ్లెంతో సహస్రధారాభిషేకం జరిపించి అభిషేక తీర్థాన్ని అర్చకులు భక్తులపై ప్రోక్షించారు.

త్రిశూలస్నానం

చండీశ్వరస్వామికి ఆలయ పుష్కరిణిలో త్రిశూల స్నానం కార్యక్రమాన్ని నిర్వహించారు. పుష్కరిణి జలాన్ని తలపై ప్రోక్షించడంతో పాపాలన్నీ హరించి శ్రేయస్సు కలుగుతుందని భక్తుల విశ్వాసం. చివరిగా చండీశ్వర స్వామికి తిరిగి పూజాదికాలు జరిపించి ఆలయంలోకి తోడ్కొని వచ్చారు. ఆయా పూజా కార్యక్రమాల్లో దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు దంపతులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అశ్వవాహనసేవ

ఉగాది మహోత్సవాల్లో భాగంగా చివరి రోజు శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు అశ్వవాహనసేవ నిర్వహించారు. ఉభయ దేవాలయ ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో అశ్వవాహనంపై ప్రత్యేకంగా అలంకరించి ఉత్సవమూర్తులను అశ్వవాహనంపై ఆశీనులను చేయించారు. ఆలయ అర్చకులు, వేదపండితులు ప్రత్యేక అలంకరణ పూజాదికాలను నిర్వహించి హారతులిచ్చారు. అనంతరం ఆలయ ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు.

భ్రమరాంబాదేవి నిజాలంకరణ

ఉగాది మహోత్సవాల్లో చేయబడుతున్న అలంకారాల్లో భాగంగా చివరి రోజు భ్రమరాంబాదేవి ఉత్సవమూర్తిని భ్రమరాంబాదేవి నిజాలంకరణ స్వరూపంలో అలంకరించారు. పూజాదికాల అనంతరం ఆలయ ప్రాంగణంలో ప్రదక్షిణగా ఉత్సవ మూర్తులకు ప్రాకారోత్సవం నిర్వహించారు.

సకల శుభాలు ప్రసాదించే భ్రమరాంబా

ఉగాది మహోత్సవాల్లో భాగంగా సోమవారం భ్రమరాంబాదేవి నిజరూపంలో దర్శనమిచ్చింది. అష్టభుజాలు కలిగిన ఈ దేవి శూలం, బాకు, గద, ఖడ్గం, విల్లు, డాలు, పరిగ మొదలైన ఆయుధాలను ధరించి జగన్మాతగా దర్శనమిచ్చారు. అమ్మవారి నిజాలంకరణ దర్శనం వలన సమస్యలన్నీ తొలగిపోయి, సకల శుభాలు కలుగుతాయని చెప్పబడుతుంది. అలాగే అశ్వవాహనాధీశులైన స్వామిఅమ్మవార్లను దర్శించడం వల్ల సమస్యలు తీరిపోతాయని, సంతానార్థులకు సంతానం కలుగుతుందని పండితులు పేర్కొన్నారు.



చండీశ్వరస్వామికి విశేష పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

మహానందీశుడికి గ్రామోత్సవం



మాడవీధుల్లో విహరిస్తున్న మహానందీశుడి దంపతులు

మహానంది: మహానందిలో కొలువైన గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులకు సోమవారం గ్రామోత్సవం నిర్వహించారు. వేలాదిగా తరలివచ్చిన కన్నడ భక్తుల దర్శనార్థం ఆలయ మాడవీధుల్లో ఉత్సవం జరిపారు. ముందుగా ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, అర్చకులు ముందుగా స్వామి, అమ్మవారి దంపతులను విశేషంగా అలంకరించారు. అనంతరం ఆలయ మాడవీధుల్లో ఉత్సవం కనులపండువగా సాగింది. కర్ణాటక భక్తులు వేలాదిగా మహానంది ఆలయానికి తరలిరావడంతో తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు రద్దీ కొనసాగింది. ఉచిత దర్శనంతో పాటు రూ.50 టికెట్లు విక్రయించడంతో కన్నడిగుల ద్వారా రెండ్రోజుల్లో సుమారు రూ.18 లక్షలకు పైగా ఆదాయం సమకూరినట్లు ప్రాథమిక సమాచారం.

కన్నడిగుల ఆకలి తీర్చిన అన్నదాతలు

మహానందీశ్వరస్వామి దర్శనార్థం వేలాది సంఖ్యలో వచ్చిన కన్నడ భక్తులకు దాతలు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. రెడ్ల సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంతో పాటు నంద్యాలకు చెందిన బల్లాని చలమయ్య, ఆర్యవైశ్య అన్నసత్రం, వీరశైవ లింగాయతుల కమిటీతో పాటు వివిధ కుల సంఘాలకు చెందిన వారు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. క్యూలైన్లలోని భక్తులకు నంద్యాలకు చెందిన కల్లూరి రామలింగారెడ్డి మజ్జిగ అందించగా, రోటరీక్లబ్ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, సెక్రటరీ బాలకృష్ణ, వీరభద్ర సప్లయర్స్ అధినేత, మహానంది ఆలయ అర్చకులు వాటర్‌బాటిళ్లను పంపిణీ చేశారు.



మహానందిలో కన్నడిగులకు అన్నప్రసాదం అందిస్తున్న దాతలు

ఇంజెక్షన్లు అందుబాటులో ఉంచాలి

– హిమోఫీలియా వ్యాధిగ్రస్తుడి విన్నపం

జూపాడుబంగ్లా: హిమోఫీలియా వ్యాధిగ్రస్తుల సౌకర్యార్థం ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఫ్యాక్టర్–7 ఇంజెక్షన్లు అందుబాటులో ఉంచాలని హిమోఫీలియా వ్యాధిగ్రస్తుడు థామస్ వేడుకుంటున్నాడు. తండంచ గ్రామానికి చెందిన ధర్మరాజు కుమారుడు థామస్ పదో తరగతి చదువుతున్నాడు. భార్య కొంతకాలం క్రితం మృతిచెందడంతో కూలీ పనులకు వెళ్తూ కుమారుడిని చదివించుకుంటున్నాడు. అయితే కుమారుడు థామస్‌కు పుట్టుకతోనే హిమోఫీలియా వ్యాధి ఉంది. ఈ వ్యాధి తీవ్రతను బట్టి ప్రతి నెలా ఫ్యాక్టర్–7, 8, 9 ఇంజెక్షన్లు వేసుకోవాల్సి ఉంది. ఇంజెక్షన్ వేయించుకోకపోతే కీళ్లవద్ద వాపులు వచ్చి అంతర్గతంగా రక్తం బ్లీడింగ్ అయి ఆరోగ్యం క్షీణించి అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొంటుంది. సోమవారం థామస్ ‘సాక్షి’తో మాట్లాడుతూ ఇంజెక్షన్లు బయట కొనుగోలు చేయాలంటే ఒక్కొక్కటి రూ.4 వేల నుంచి రూ.6 వేలు ఉందన్నారు. ఫ్యాక్టర్–7 ఇంజెక్షన్లు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఆస్పత్రుల్లో సరఫరా లేదంటున్నారన్నారు. తన తండ్రి కూలీ పనులకు వెళ్లి తనను పోషిస్తున్నాడని బయట ఇంజెక్షన్లు కొనుగోలు చేసే శక్తి తమకు లేదన్నారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో ఇంజెక్షన్లు, మందులు అందుబాటులో ఉండేవన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా ఇంజెక్షన్లు అందుబాటులో ఉంచాలని కోరారు.



తండ్రి ధర్మరాజుతో ఉన్న హిమోఫిలియా వ్యాధిగ్రస్తుడైన పదోతరగతి విద్యార్థి థామస్

2 నుంచి రిజిస్ట్రేషన్లు

నంద్యాల(అర్బన్): ఏప్రిల్ 2 నుంచి నంద్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన స్లాట్ బుకింగ్ ద్వారా సులభతరమైన రిజిస్ట్రేషన్లు జరగనున్నాయని సబ్ రిజిస్ట్రార్–2 చంద్రమౌళి సోమవారం తెలిపారు. ఏపీ రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ ఉత్తర్వులు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ రిజిస్ట్రేషన్ స్టాంపుల శాఖ కర్నూలు వారి ఉత్తర్వుల మేరకు దస్తావేజు స్వీకరణకు ప్రభుత్వం స్లాట్ బుకింగ్‌ను నూతనంగా ప్రవేశపెట్టిందన్నారు. క్యూలైన్‌లో వేచి చూడకుండా ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పుణ్య క్షేత్రాలను సందర్శించిన ప్రముఖులు



సంగమేశ్వరంలో జడ్జి దంపతులకు స్వాగతం పలుకుతున్న పురోహితుడు

కొత్తపల్లి: మండలంలోని సంగమేశ్వరం, కొలనుభారతి క్షేత్రాలను కర్నూలు ఉప లోకాయుక్త జస్టిస్ పి.రజని రెడ్డి దంపతులు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, టీటీడీ మాజీ ఈఓ ఐవీ కృష్ణారావు సోమవారం సందర్శించారు. ముందుగా సంగమేశ్వరం చేరిన వీరికి ఆలయ పురోహితుడు తెలకపల్లి రఘురామ శర్మ ఆలయ సంప్రదాయాలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ చరిత్రను వివరించారు. వారు వేపధారు శివలింగానికి ప్రత్యేక పూజలు చేసుకున్నారు. అనంతరం కొలనుభారతిదేవి ఆలయాన్ని చేరుకుని సరస్వతి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అక్కడే ఉన్న సప్తశివాలయాలను సందర్శించుకుని, ఛారుఘోషిని నదిని తిలకించారు.

సున్నిపెంట భూములపై నేటి నుంచి సర్వే



సమావేశంలో పాల్గొన్న అధికారులు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం మండలంలోని సున్నిపెంట గ్రామంలో భూములపై మంగళవారం నుంచి రీ సర్వే జరుగనుంది. దీనిపై సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ డివిజనల్ అధికారి నాగజ్యోతి ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం జరిగింది. సున్నిపెంటలో పర్యాటక రంగ అభివృద్ధి కోసం 50 ఎకరాల ప్రభుత్వ ఖాళీ స్థలాన్ని గుర్తించి, నివేదికలు సమర్పించాలని ప్రభుత్వం ఆదేశించినట్లు తెలిసింది. 50 ఎకరాల స్థల గుర్తింపు కోసం మంగళవారం నుంచి ప్రభుత్వ భూములపై రీ సర్వే చేయనున్నారు. జలవనరుల శాఖ ఆధీనంలో 1,468.52 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉండగా, గత ఏడాది మే 11న అప్పటి ప్రభుత్వం పరిపాలనా సౌలభ్యం కోసం గ్రామంగా నిర్మితమై ఉన్న 208.70 ఎకరాల స్థలాన్ని జీఓ నెం.40 ప్రకారం పంచాయతీరాజ్ శాఖకు అప్పగించింది. అయితే 208.70 ఎకరాల స్థలానికి సరిహద్దులను గుర్తించలేదు. సమావేశంలో శ్రీశైలదేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు, డ్యాం ఎస్‌ఈ శ్రీరామచంద్రమూర్తి, తహసీల్దార్ కేవీ శ్రీనివాసులు, జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి రవీంద్రపాల్, అటవీశాఖ రేంజ్ అధికారి సుభాష్ పాల్గొన్నారు.


అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


బేతంచెర్ల: డోన్‌కు చెందిన వ్యక్తి ఆర్టీసీ బస్సులో అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఎస్‌ఐ రమేష్ బాబు వివరాల మేరకు.. డోన్ కొండపేటకు చెందిన ఆవుల శ్రీధర్‌నాయుడు (52) స్టేట్ బ్యాంక్‌లో మెసెంజర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం ఆరేళ్ల కుమారుడితో కలిసి బేతంచెర్ల మండలం ముద్దవరం గ్రామంలోని సుంకులమ్మ దర్శనం కోసం బైక్‌పై వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో బేతంచెర్లలోని డోన్ క్రాస్ రోడ్డులో ఆర్టీసీ బస్సు ఎక్కాడు. డోన్ చేరుకోగానే శ్రీధర్ నాయుడు అపస్మారక స్థితిలో ఉండడంతో కుమారుడు కండక్టర్ వద్దకు వెళ్లి తన తండ్రి లేవట్లేదని తెలిపాడు. కండక్టర్ కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. అతన్ని చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

దాన, ధర్మాల మాసం రంజాన్

- భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేసిన ముస్లింలు

పవిత్ర రంజాన్ మాసం దాన, ధర్మాల మాసమని ముస్లిం మతపెద్దలు పేర్కొన్నారు. సంపాదించిన దాంట్లో కొంత దాన, ధర్మాలకు ఖర్చు చేయాలని సూచించారు. నందికొట్కూరు, శ్రీశైలం నియోజకవర్గాల్లో రంజాన్ వేడుకలను ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఉదయమే స్నానాలాచరించి, కొత్త దుస్తులు ధరించి ఈద్గాలు, మజీదులకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మత పెద్దలు రంజాన్ విశిష్టతను వివరించారు.





నందికొట్కూరులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు, పాములపాడు ఈద్గా వద్ద ప్రార్థనల్లో ముస్లింలు



శివపురం ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

నందికొట్కూరు: పట్టణంలోని తబ్లిక్ జామద్ మసీద్‌లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఎస్‌ఐ సురేష్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

పాములపాడు: రంజాన్ నెలంతా పవిత్ర ఉపవాసాలు పూర్తి చేసిన మండలంలోని ముస్లింలు ఈద్గాల వద్దకు చేరుకుని ప్రార్థనలు చేశారు. ప్రపంచ శాంతిని కోరుతూ, మానవాళి సుఖశాంతులతో ఉండాలే అల్లాను ప్రార్థిస్తూ మత గురువులు దువా చేశారు.

కొత్తపల్లి: మండల కేంద్రంతోపాటు దుద్యాల, కొక్కెరంచ, ఎదురుపాడు, శివపురం, ముసలిమడుగు, ఎర్రమఠం, గువ్వలకుంట్ల, నందికుంట, జి.వీరాపురం గ్రామాల్లోని ఈద్గాలు, మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించుకున్నారు.

పగిద్యాల: మండలంలోని నెహ్రూనగర్, పీకే ప్రాగటూరు, పాత, కొత్త ముచ్చుమర్రి, బీరవోలు, సంకిరేణిపల్లె, పగిద్యాల, లక్ష్మాపురం, ప్రాతకోట, ఎన్.ఘణపురం గ్రామాల్లోని ముస్లింలు ఉదయం గ్రామ శివారుల్లోని ఈద్గాలకు చేరుకుని అల్లాకు ప్రత్యేక దువా చేశారు. మత బోధకులు ఖురాన్ గ్రంథంలోని బోధనలను వివరించారు.

జూపాడుబంగ్లా: మండలంలోని తాటిపాడు, తర్తూరు, మండ్లెం, జూపాడుబంగ్లా, 80బన్నూరు, తరిగోపుల, పారుమంచాల, తూడిచెర్ల, తదితర గ్రామాల్లోని ముస్లింలు ఈద్గాల వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లిం మత గురువులు రంజాన్ ప్రాముఖ్యతను తెలియజేశారు.

ఆత్మకూరు: పట్టణంలో ముస్లింలు రంజాన్‌ను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ముందుగా కొత్తపేట మసీదు నుంచి నంద్యాల టర్నింగ్ మీదుగా సమాధుల వద్దకు వెళ్లి వారి పెద్దలకు నివాళులర్పించారు. కూడళ్ల వద్ద ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు రషీద్, నాయకులు సయ్యద్‌మీర్, రాజశేఖర్ తదితరులు ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కురుకుంద, అమలాపురం, వెంకటాపురం, కృష్ణాపురం, ముష్టపల్లె, శ్రీపతిరావుపేట, కరివేన, నల్లకాల్వ తదితర గ్రామాల్లోనూ ముస్లింలు రంజాన్‌ను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.


బండి ఆత్మకూరు: మండల వ్యాప్తంగా ముస్లింలు ఈద్గా వద్దకు చేరి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రెండు రకాత్‌ల వాజిబ్ నమాజ్ చదివి, దువా చేయడంతో ఈద్– ఉల్– ఫితర్ నమాజ్ ముగిసింది. అనంతరం ఒకరికొకరు ఈద్ ముబారక్ చెప్పుకున్నారు.

శ్రీశైలంప్రాజెక్ట్: రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. సున్నిపెంట చెక్‌పోస్టు వద్ద ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రాగా కేంద్రం ప్రవేశపెడుతున్న వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా నల్లబ్యాడ్జీలు ధరించి ప్రార్థనల్లో పాల్గొన్నారు.

మహానంది: మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురం, అబ్బీపురం, బుక్కాపురం, గాజులపల్లె, గోపవరం, మసీదుపురం, బొల్లవరం, తమ్మడపల్లె, అల్లినగరం, గాజులపల్లె ఆర్ఎస్, సీతారామపురం, నందిపల్లె గ్రామాల్లో రంజాన్ వేడుకలు నిర్వహించారు. ఈద్గాలు, మసీదుల్లో ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ సాటి మనిషిపై దయ, ప్రేమ చూపాలన్నారు.



ఆత్మకూరులో ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న సీపీఎం నాయకులు



పార్నపల్లిలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



లక్ష్మాపురంలో ప్రార్థనల కోసం ఈద్గాకు బయలుదేరిన ముస్లింలు

ముస్లింలపై వివక్ష తగదు



బస్టాండ్ సెంటర్‌లో రాస్తారోకో చేస్తున్న ముస్లిం మైనార్టీలు

పాములపాడు: కేంద్ర ప్రభుత్వం ముస్లింల పట్ల వివక్ష చూపడం తగదని ముస్లిం మత గురువులు సుభాన్, ఆరిఫ్, దూదేకుల నూరుబాషా ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు మౌలావుశేన్, కోఆప్షన్ సభ్యుడు మూర్తుజాఅలీ అన్నారు. సోమవారం స్థానిక మజీద్ ఏ హాస్మి నుంచి నల్ల బ్యాడ్జీలు ధరించి ర్యాలీగా బస్టాండ్ సెంటరుకు చేరుకొని రాస్తారోకో నిర్వహించారు. వారు మాట్లాడుతూ నిరంకుశంగా చేపట్టనున్న వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలన్నారు.ముస్లిం వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులకు స్థానం కల్పించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు ఖాశీం, మాబాషా, ఇస్మాయిల్, నబీరసూల్, అన్వర్, అబ్దుల్లా, మహ్మద్‌హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లు రద్దు చేయాలి

కొత్తపల్లి: కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలని మండల కేంద్రంలోని గాంధీ విగ్రహం వద్ద ముస్లింలు సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ముస్లింలు ఖాజా, వహీద్, బషీర్, ఇస్మాయిల్, మొల్ల భాషా, మహమ్మదనీఫ్, పెద్ద హుస్సేన్‌లు మాట్లాడుతూ వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులకు స్థానం కల్పించడం తగదన్నారు. కార్యక్రమంలో ముస్లింలు నజీర్, షరీఫ్, మౌలాలి, సలాం, హుస్సేన్, చాంద్ బాషా, మూర్తుజావలి, సయ్యద్, అలీ, అలీబాషా, మాలిక్, షాదీక్, షాజీద్, హసన్ పాల్గొన్నారు.



కొత్తపల్లిలోని గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లింలు

వివాహిత అదృశ్యం

బనగానపల్లె రూరల్: అప్పలాపురం గ్రామానికి చెందిన సద్దాం హుస్సేన్ భార్య షేక్ అఫ్సాన అదృశ్యమైనట్లు సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య తెలిపిన వివరాలు.. అఫ్సాన గత శనివారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తెలిసిన చోటల్లా విచారించినా ఆచూకీ లేకపోవడంతో ఆమె తల్లి షేక్ రమిజాబీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.